## కథ

# సిరిమల్లెలు

**''మల్లి! ఇయ్యాళ ఎట్టాగ యినా పనిలోకెళ్తానే, నువ్వేం అడ్డుసె ప్పమాకు, నా ఒంట్లో బాగానే ఉంది'' అన్నాడు అమ్ములుగాడు. వాడి భార్య మల్లి కూడా ఏమీ అనలే కపోయింది. అమ్ములుగాడికి గడచిన వారం రోజుల నుండి జ్వరం వస్తోంది.**

''ఒంట్లో బాగాలేదు కదా, ఈయాళ పనిలోకె ళ్లొద్దులే మావా!'' అని అమ్ములుగాడ్ని పనిలోకె ళ్లకుండా రోజూ ఆపుతూనే ఉంది. అమ్ములుగా డికొచ్చిన జ్వరం రోజు రోజుకీ ఎక్కువవ్వసా గిందే కానీ ఏమాత్రం తగ్గటం లేదు. ఏరోజు కూలి డబ్బులతో ఆ రోజు బ్రతుకును వెళ్లదీసు కునే ఈ జంటకు ఈవారం రోజుల నుండి పూట గడవటం కూడా కష్టమయిపోయింది.

''చూశావా మావ! రెండ్రోజులు నీ ఒంట్లో బాగుండకపోతే ఇన్ని గంజిమెతుకులు కూడా సంపాదించలేని పాపిష్టిదాన్ని'' అన్నది మల్లి చిన్న ప్పుడే పోలియో సోకి చచ్చుబడిన తన రెండుకా ళ్లను చూసుకుంటూ.

ఆ మాటలు విన్న అమ్ములుగాడి గుండె బాధతో పిండినట్టయింది.

''నువ్వట్టాంటి మాటలని నన్నెందుకేడిపిత్తావే. నువ్వు పుట్టినప్పుడు ఆ దేవుడు నాకు కల్లో కనిపించి, 'ఒరే అమ్ములుగా బంగారబ్బొమ్మ లాంటి మల్లిని నీ సేతిలో పెడతన్నా. ఏ కట్టం రాకుండా కాలుకింద పెట్టకుండ, కంటికి రెప్పెలె సూసుకో' అని సెప్పి నాడే'' అమాయకంగా అన్నాడు అమ్ములుగాడు.

'అమ్ములుగాడు ఉత్తి ఎర్రిబాగులోడు' అని అమ్ములుగాడ్ని ఉద్దేశించి ఆ ఊరు జనాలనే మాటలు ఆ క్షణం అమ్ములుగాడన్న ఆ మాటలు విని 'ఎవరన్నారు నా మావను ఎర్రిబా గులోడని. ఒకవేళ ఆ మాట నిజమయితే అయి ఉండవచ్చు గాక! కానీ నా మావ మనసున్నాడు, నేనంటే ప్రాణమిచ్చేవాడు' అనుకుంది మల్లి.

''అవును మావా, నా కాలు కింద పెట్టకుండా చూసుకోవాలనే ఆ దేవుడు కాళ్లు ఇవ్వలేదు, నిన్ని చ్చాడు నా ఆరో ప్రాణంగా''

మల్లి మాటలు అర్థంకాని అమ్ములుగాడు ''ఈ రోజు కూలికెళ్తా. వచ్చిన పైసల్తో కడుపు నింపుకుందాం'' అన్నాడు.

మల్లి, మళ్లీ ఏదయినా అడ్డుచె బుతుందేమోనని తన కండువా భుజాన వేసు కుంటూ ''ఇద్దరం కడుపు నిండా అన్నం తిని వారం రోజులైంది. నాకు కడుపు నిండా అన్నం తినాలనుంది మల్లి'' అంటూ కూలీకి బయలుదేరిన అమ్ములుగాడికి ఏ అడ్డు చెప్పలేకపోయింది మల్లి. మల్లికి తెలుసు తను పస్తుండడం చూడలేకే అమ్ములుగాడు పని లోకెళ్తానని పట్టుబడుతున్నాడు.

తనకి ఆకలిగా ఉందని చెప్పడం కేవలం మల్లిని ఒప్పించడానికే!

★ ★ ★

''ఒరే అమ్ములుగా! వారం రోజులుగా యాడికి పోయినావురా!'' అని ప్రశ్నించాడు గవ్రరాజు గారు. గవ్రరాజు



**యంజర్లపాటి కమలాకర్ రెడ్డి**

గారి దగ్గరే అమ్ములుగాడు కూలి చేసేది.

''ఒంట్లో బాగుండక రాలేదు దొరా!'' అని వినయంగా సమాధాన మిచ్చాడు అమ్ములుగాడు.

''ఇప్పుడయితే బాగానే ఉంది కదా''

''బాగానే ఉంది దొరా!''

''పోయి పని చేస్కో'' అనగానే లేని ఉత్సాహాన్ని తెచ్చుకుని వెనుదిరుగు తున్న అమ్ములుగాడ్ని చూసి ''అవున్రా అమ్ములూ! ఇంత పెంద లాడే పనిలోకొచ్చినావు ఎంగిలి పడ్డావా? లేదా?'' అని ప్రశ్నించాడు గవర్రాజు.

మౌనంగా నిలుచున్న అమ్ములుగాడ్ని చూసి ఏదో అర్థమైనవాడిలా ''అరెయ్ అమ్ములూ! నువ్వు నోరు తెరిచి ఎవ్వర్నీ ఏమీ అడగవు గదా! నాకు ఒంట్లో బాగాలేదు దొరా అంటే అవసర మైన పైసలిద్దును కదరా! సరేలే అమ్మగారి దగ్గర కెళ్లి ఇన్ని మెతుకులు ఎంగిలిపడి రాపో'' అన్నారు గవర్రాజుగారు.

★ ★ ★

''మల్లి....మల్లి'' అంటూ లోపలికొచ్చింది టీచరమ్మ. అమ్ములుగాడి గుడిసెకు దగ్గర్లోనే ఉన్న డాబాలో టీచరమ్మగారుండేది. ఆ పల్లె టూరి బడిలోనే టీచరమ్మగారు పాఠాలు చెప్పేది. మల్లి-అమ్ములుగాడి జంటంటే ఆ టీచరమ్మకు చాలా ప్రేమ. టీచరమ్మ మీద ప్రేమ లేని ఆమె భర్త, వేరే ఆమె మీద ప్రేమతో ఎటో వెళ్లిపో యాడు. అటుపైన ఆ వేరే ఆమె తప్పించి ఎవ్వరూ బాధపడలేదు.


''ఇప్పుడే ఊర్నుండొచ్చా మల్లి, రాగానే తెలి సింది అమ్ములుకి వారం రోజులుగా జ్వరమని, పని క్కూడా వెళ్లటం లేదని...సరే అదంతా తర్వాత కానీ ముందు ఈ అన్నం తిను'' అంటూ వేడి అన్నం గిన్నెను మల్లికందించింది.

టీచరమ్మకి తెలుసు, అమ్ములుగాడు పనిలోకెళ్ల కపోతే ఆ ఇంటి పొయ్యిలో పిల్లి లేవ దని!

''అవును అమ్ములేడి'' అంది టీచ రమ్మ చుట్టూ చూస్తూ.

''నేను పస్తులుండటం చూడలేని నా మావ జెరాన్ని కూడా లెక్క చేయ కుండా కూలీకెళ్లాడమ్మా'' అంది మల్లి వస్తున్న దుఃఖాన్ని ఆపు కుంటూ.

''నేను వచ్చాకద మల్లి. అమ్ముల్ని డాక్టరు దగ్గరకు తీసుకువెళ్తాం. అన్నట్టు నాకొద్దిగా పనుంది. నువ్వీ అన్నం తిను. నేనిప్పుడే




వస్తా'' నంటూ టీచరమ్మ వెళ్లిపోయింది.

★ ★ ★

అమ్ములుగాడు తన గుడిసెవైపు పరుగులాంటి నడక సాగిస్తున్నాడు.


గవర్రాజుగారింట్లో, ఆయన భార్య అమ్ములుగా డికి స్వయంగా అన్నం పెట్టి పనుంటే తను వెళ్లింది. అప్పటివరకూ ఏదో ఆలోచిస్తున్న అమ్ములుగాడు, ఒక్క క్షణం ఆలస్యం చేయ కుండా తన ఎదుట అన్నం కూరలతో ఉన్న ఆ విస్తరిని తన కండువాలో భద్రంగా కట్టుకుని గుడిసె వైపు బయలుదేరాడు.

వాడి నడకతో ఇంటికి త్వరగా చేరాలన్న ఆత్రుత ఉంది.

★ ★ ★

''మావ సాయంత్రం వరకూ ఒంట్లో జెరంతో కాలే కడుపులో పనిసేత్తా ఉంటే, నేనింట్లో కూకుని ఈ అన్నం తినగలనా? అసలు నాకి యన్నం ఎలా సయిత్తుంది'' తన ఎదురుగా ఉన్న అన్నం గిన్నెను చూస్తూ అనుకుంది మల్లి. 'మావనెవరయినా పిలుసుకొత్తే బాగుండు' అను కొంటుండగా ''మల్లి...మల్లి'' అంటూ అమ్ము లుగాడు వడివడిగా గుడిసెలోకి ప్రవేశించాడు.

''లే మల్లి..లే. ఈ అన్నం తిను. అమ్మగారు నా కడుపు నిండా అన్నం పెట్టి, మల్లికి కూడా పట్టు కెళ్లురా అని కండువాలో కట్టించిందే'' అంతే




ఆత్రంగా అన్నాడు అమ్ములుగాడు.

అమ్ములుగాడ్ని చూస్తూనే మల్లి మనసు ఆనందంతో నిండిపోయింది. అమ్ములుగాడు ఏం చెబుతున్నాడో విన కుండా ''రా మావా..రా! నీ కోసమే ఎదురుసూతున్నాను. టీచరమ్మగారు ఊర్నుండొచ్చారు. నీకు జెరమొచ్చిం దని తెలిసి సానా బాధపడ్డారు. ఇదిగో ఇప్పుడే నా కడుపు నిండా అన్నం పెట్టి, నీ కోసం ఇదిచ్చారు'' అని తన చేతిలో ఉన్న ఆ అన్నం గిన్నెను అంది వ్వబోయింది.

మల్లి తన చేతిలో అన్నం గిన్నె అంది వ్వడం, అమ్ములుగాడు తన కండువాలోని అన్నం విస్తరిని మల్లికివ్వబోవడం ఒకేసారి జరిగింది.

ఎవరి ఆత్రుతలో వారుండి ఇప్పటివరకూ ఎదు రువారు ఏం చెబుతున్నారో అర్థం చేసుకోలేదు. ఆ క్షణం ఇద్దరికీ జరిగిందేమిటో అర్థంకావడానికి కొంత సమయం పట్టింది.

మొదట తేరుకుని మాట్లాడింది మల్లే ''నిజం సెప్పు మావా! నువ్వు కడుపు నిండా అన్నం తిన్నావా? నువ్వు తిన్న తరువాత నేను గుర్తొచ్చి నా కోసం తెచ్చావా? అదీ అమ్మగారిచ్చాక!''

సరిగా మాట్లాడటం రాదనే అమ్ములుగాడు కూడా ఆ క్షణం బాధా - ఆవేశం కలిసిన గొంతుతో ''నేను కాదు, నువ్వు నిజం సెప్పు మల్లి, టీచరమ్మగారిచ్చిన అన్నం తినకుండా నా కోసం ఎందుకు దాచావు?'' అని సూటిగా ప్రశ్నించాడు.

''నా కోసం, నా కడుపు నింపటం కోసం కాలే ఒళ్లుతో, కాలుతున్న కడుపుతో నువ్వు పని సేత్తుంటే నాకీయన్నం ఎట్టా సయిత్తుంది మావా!'' అంది మల్లి కన్నీటి సంద్రానికి కనురె ప్పలు కట్టలు లేస్తూ.

''నాకు మాత్రం నిన్నొదిలేసి అన్నం తినబుద్ధ యిందంటే? నేను కూలీకెళ్లినా, కట్టం సేసినా మనిద్దరి కోసమేకదే! అసలు నేను బతికేదే నీ కోసం కద మల్లి'' అన్నాడు అమ్ములు గాడు, ఉబికి వస్తున్న కన్నీటిని చేత్తో తుడుచుకుంటూ. ఆ క్షణం అమ్ములు గాడు ఓ పాపాయిలా అనిపించాడు. అలాగే గట్టిగా హృదయానికి హత్తు కుంది. తమ ఇరువురుని ఏ కష్టం వేరు చేయలేదని.

ఆ సిరిమల్లెపువ్వుల ప్రేమ పరిమళం ఆస్వాదించిన ప్రకృతి తన్మయత్వం చెంది, చిరుజల్లును కురిపించింది.